జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 158 3-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06






# మెట్రోపై సానుకూలం

- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భేటీ
- మెట్రో ఫేజ్--2ను సంయుక్త వెంచర్‌గా చేపట్టాలని రేవంత్ వినతి
- మెట్రో తొలి దశకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం మంజూరు చేయాలని విజ్ఞప్తి
- సంయుక్త కమిటీ నియమిస్తే విస్తరణ వేగవంతమవుతుందన్న కేంద్ర మంత్రులు
- నేడు కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం


న్యూఢిల్లీ,:దేశ రాజధాని పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా వీరితోపాటు చర్చల్లో పాల్గొన్నారు. ఢిల్లీలోని రైల్వేభవన్ వీరి సమావేశానికి వేదికైంది. వీరి మధ్య దాదాపు రెండు గంటలపాటు చర్చలు సాగాయి. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) రుణంతోపాటు మెట్రో ఫేజ్--2 విస్తరణకు త్వరితగతిన అనుమతుల విషయమై వారి మధ్య ప్రధానంగా చర్చ జరిగింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్--1కు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇప్పటివరకు రూ.1,204 కోట్లు ఇచ్చిందని ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు తెలిసింది. ఫేజ్--2 విషయంలో తర్జనభర్జనలు గుతున్న సమయంలోనూ కేంద్రం సూచించిన రెండు ప్రత్యామ్నాయాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. దీనిలో ప్రధానంగా రూ.10వేల కోట్లు తక్కువ ఖర్చయ్యేలా సూచించిన

- మిగతా 2వ పేజీలో

## ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి...

# జాగ్రత్తగా ఉండాలి

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపు



రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం

- మిగతా 2వ పేజీలో

## ఇసుక దందాకు నిండు ప్రాణం బలి

- ఇసుక లారీలతో మణుగూరులో ట్రాఫిక్ జామ్
- 20 కి.మీ. దూరానికి 2 గంటల సమయం
- సకాలంలో వైద్యం అందక యువకుడు మృతి



2లో




## ఆ రోజు మా అమ్మ అడిగిన ప్రశ్నకు జవాబే ఈ క్యాన్సర్ ఆసుపత్రి

- బసవతారకం ఆసుపత్రి 25 ఏళ్ల వేడుకలో భావోద్వేగంగా ప్రసంగించిన బాలకృష్ణ
- తల్లి కోరిక, తండ్రి ఆశయంతోనే ఈ సంస్థ ఏర్పాటైందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాతలు, ప్రభుత్వాల సహకారాన్ని గుర్తుచేసుకున్న బాలయ్య

2లో

## మూడు S'లే మా బలం...

- రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్
- ఢిల్లీలో మీడియా కాంక్లేవ్
- వేగం, స్థిరత్వం, సేవ అనే మూడు 'స'ల వల్లే ఏపీకి పెట్టుబడులన్న లోకేశ్
- 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- 2028 నాటికి అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని ధీమా



# స్టార్మర్ రాజీనామా

- బ్రిటన్ ప్రధాని పదవిని త్యజించిన లేబర్ పార్టీ నేత
- పీఠం నుంచి దిగిపోవాలంటూ సొంత పార్టీ ఎంపీల నుంచి ఒత్తిడి
- పగ్గాలు స్వీకరించేందుకు బర్న్‌హామ్‌కు మార్గం సుగమం



2లో

# రెబెల్స్ చీఫ్‌గా అరూప్

- కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్న టీఎంసీ రెబెల్ ఎమ్మెల్యేలు
- టీఎంసీకి సమాంతరంగా పార్టీ నిర్మాణం
- ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తాం
- జిల్లా కమిటీలను కూడా నియమిస్తామన్న రితబ్రత బెనర్జీ
- మమత ముఖ్య సలహాదారుగా ఉండొచ్చని వ్యాఖ్య



2లో

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

- ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

## లక్నో అగ్నిప్రమాదంలో

# 14 మంది మృతి..

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



2లో

# లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి..

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## ఆ రోజు మా అమ్మ అడిగిన ప్రశ్నకు జవాబే ఈ క్యాన్సర్ ఆసుపత్రి

"ఈ రోజు నేను మీ ముందు ఒక నటుడిగానో, ప్రజాప్రతినిధిగానో నిలబడలేదు. ఒక కొడుకుగా ఈ వేదికపై ఉన్నాను" అంటూ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, నందమూరి బాలకృష్ణ తన ప్రసంగాన్ని భావోద్వేగభరితంగా ప్రారంభించారు. ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన తల్లి బసవతారకం క్యాన్సర్‌తో పోరాడుతున్న రోజులను గుర్తుచేసుకుంటూ, ఆసుపత్రి ఏర్పాటు వెనుక ఉన్న ఆశయాన్ని వివరించారు. 1984లో తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పుడు, తమకు చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత ఉందని, కానీ చుట్టూ ఉన్న ఎందరో నిస్సహాయులను చూసి తన తల్లి ఆవేదన చెందారని బాలకృష్ణ తెలిపారు. "డబ్బులున్న మనం చికిత్స చేయించుకోగలుగుతున్నాం, మరి పేదల పరిస్థితి ఏంటి?" అని తన తల్లి అడిగిన ఒక సామాన్యమైన ప్రశ్నే ఈ బృహత్తర కార్యక్రమానికి పునాది వేసిందన్నారు. ఆ ప్రశ్నను తన తండ్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు ఒక బాధ్యతగా స్వీకరించి, డబ్బు లేదన్న కారణంతో ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదన్న లక్ష్యంతో 1989లో ఈ సంస్థకు పునాది వేశారని గుర్తుచేసుకున్నారు.

## ఇసుక దందాకు నిండు ప్రాణం బలి

మణుగూరు రూరల్: ఇసుక లారీల వల్ల ఏర్పడిన ట్రాఫిక్ జామ్ లో అంబులెన్స్ చిక్కుకోగా... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి ఎదురైంది. ఇసుక లారీల వల్ల 20 కి.మీ దూరం ప్రయాణానికి రెండు గంటలకుపైగా పట్టడంతో నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ ఘటన సోమవా రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో చోటుచేసుకుంది. పినపాక మండలం గడ్డిగూడెం గ్రామానికి చెందిన కొమురం వంశీ (32) బీటీపీఎస్ ప్లాంట్‌లోని బూడిద చెరువు వద్ద డెయిలీ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మార్గమధ్యలో వ్యక్తిగత కార ణాలతో గడ్డి మందు తాగగా, మణుగూరు మండలంలోని దమ్మక్కపేట లో మామ వరుసయ్యే మడి శంకర్ ఇంటికి వెళ్లి విషయాన్ని చెప్పాడు. దీంతో శంకర్ 108 కు ఫోన్ చేశారు. ఆపై అంబులెన్స్ వచ్చే వరకు ఆలస్యమవుతుందని బైక్‌పై మణుగూరు-- ఏటూరునాగారం ప్రధాన రహ దారి వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి ఆటోలో మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సాంబాయిగూడెం దగ్గరికి ఆటో చేరుకోగానే రామానుజ వరం--1 ఇసుక రీచ్‌కు వచ్చి వెళ్లే లారీలతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రెండు వైపులా కిలోమీటర్ మేర భారీ లారీ లు నిలిచిపోయాయి.

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు:

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# రెబెల్స్ చీఫ్‌గా అరూప్

కోల్‌కతా: మాజీ సీఎం మమతా బెనర్జీ సారథ్యంలో ఉన్న టీఎంసీని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు తిరుగుబాటు వర్గం వేగంగా పావులు కదుపుతోంది. సోమవారం ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ అధ్యక్షతన సమావేశమైన టీఎంసీ రెబెల్ వర్గం ఎమ్మెల్యేలు తమ చైర్‌పర్సన్‌గా అరూప్ రాయ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి కౌన్సెలర్లు, ఇతర నేతలు సైతం హాజరయ్యారు. రాయ్‌ని ఏకగ్రీవంగా పార్టీ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని చెప్పారు. అంతేకాకుండా, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్, ఎమ్మెల్యేలు ఫిర్హాద్ హకీమ్, రతిన్ ఘోష్, సబినా యాస్మిన్‌లను వైస్ చైర్‌పర్సన్లుగా, రితబ్రత బెనర్జీ, జావెద్ ఖాన్, సాందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగాను, అఖ్రుజ్జమాన్ అన్సారీని ట్రెజరర్‌గాను నియమించారు. మమత సారథ్యంలోని టీఎంసీని సంస్థాగతంగా సవాల్ చేసే చర్యగా దీనిని భావిస్తున్నారు.

అసెంబ్లీలో ప్రారంభమై, పార్లమెంట్‌కు సైతం పాకిన ఈ తిరుగుబాటు ఇప్పుడు పార్టీ అధిష్టానానికి కూడా




చేరుకుందనే సంకేతాన్ని ఈ పరిణామంతో స్పష్టమవుతోంది. తమ వర్గానికి చట్టబద్ధత కల్పించేందుకుగాను పార్టీ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామని, ఈ వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని బెనర్జీ స్పష్టం చేశారు. తమదే టీఎంసీ అంటూ ఆయన.. ఏది అసలైన టీఎంసీనో ఎన్నికల కమిషనే నిర్ణయిస్తుందని కూడా చెప్పారు. నూతన నాయకత్వం త్వరలోనే వివిధ స్థాయిల్లో పార్టీ నియామక, సంస్థాగత నిర్మాణాన్ని పునరుద్ధరిస్తుందని ఆయన చెప్పారు. త్వరలోనే జిల్లా కమిటీలను, రాష్ట్ర విభాగాన్ని, ప్రతినిధుల ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇష్టమైతే, తమ వర్గానికి మమతా బెనర్జీ ముఖ్య సలహాదారుగా ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఆమె ముఖ్య సలహాదారుగా వస్తానంటే సాదరంగా స్వాగతిస్తామని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి తర్వాత టీఎంసీ పార్టీలో మునుపెన్నడూ లేని రీతిలో తీవ్ర సంక్షోభం తలెత్తడం తెలిసిందే. అసెంబ్లీకి ఎన్నికైన 80 మందికిగాను ఏకంగా 58 మంది రెబెల్ వర్గంలో చేరగా, పార్లమెంట్‌లో 28 మంది ఎంపీల్లో 20 మంది వేరు కుంపటి పెట్టుకున్నారు.

## మూడు 'S'లే మా బలం...

పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు మొగ్గు చూపడానికి వేగం అనే మూడు "స"లే ప్రధాన కారణమని, అవే తమ ప్రభుత్వ విజయ రహస్యాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ నిర్వహించిన కాంక్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ అర్నబ్ గోస్వామి అడిగిన పలు ప్రశ్నలకు లోకేశ్ సూటిగా, స్పష్టంగా సమాధానాలిచ్చారు. ఏపీ అభివృద్ధి ప్రణాళిక, తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను జాతీయ వేదికపై సమగ్రంగా వివరించారు. ఈ చర్చను అర్నబ్ గోస్వామి తన పాత జ్ఞాపకాలతో ప్రారంభించారు. "మీ తండ్రి చంద్రబాబు గారు 90వ దశకం చివర్లో కేంద్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్నప్పటి నుంచి నాకు తెలుసు. అప్పట్లో మాతో చాలా చనువుగా ఉండేవారు. ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే ఆ రోజులు గుర్తొస్తున్నాయి. మీలో మీ నాన్నగారి పోలికలు, అదే ఆకర్షణ కనిపిస్తున్నాయి. అందుకే మిమ్మల్ని ప్రజలు మరింత దగ్గరగా తెలుసుకోవాలని కోరుకుంటున్నారు" అంటూ లోకేశ్ ను సంభాషణలోకి ఆహ్వానించారు. అర్నబ్ అడిగిన ఈ ప్రశ్నకు లోకేశ్ బదులిస్తూ, "ఇదొక అద్భుతమైన ప్రయాణం. రాజకీయమనేది గమ్యం కాదు, ఒక నిరంతర ప్రయాణం. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు ఉంటే నాకు ఇంకా 40-50 ఏళ్ల రాజకీయ భవిష్యత్తు ఉంది. గత పదేళ్లలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు, పరాజయాలను సమానంగా స్వీకరించాను. ప్రస్తుతం యువ నాయకులు బాధ్యతలు స్వీకరించి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాల్సిన సమయం ఇది. నేను అదే బాటలో పయనిస్తున్నాను" అని తెలిపారు.

**ముఖ్యమంత్రి మీకు ఇచ్చిన లక్ష్యం ఏంటి?**

"2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనేది మా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన విజన్. ఆయనకు పనులు ఎప్పుడూ వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు ఆయన వేగాన్ని అందుకోవడం కష్టమే అయినా, ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ప్రస్తుతం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి నేను చైర్మన్‌గా ఉన్నాను. ఉద్యోగాల సృష్టే నా ఏకైక లక్ష్యం. ఇదే నన్ను రేయింబవళ్లు పనిచేసేలా చేస్తోంది" అని లోకేశ్ వివరించారు. "మేం మూడు 'స'ల ఫార్ములాను నమ్ముకున్నాం. అవే వేగం, స్థిరత్వం, సేవ. మా వేగానికి నిదర్శనమే దేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అయిన గూగుల్ డేటా సెంటర్ కేవలం 13 నెలల్లో, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17 నెలల్లో పనులు ప్రారంభించడం. స్వదేశీ ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏకు 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చాం. రెండోది స్థిరత్వం. మా నాయకుడికి అభివృద్ధిపై స్పష్టమైన ట్రాక్ రికార్డ్ ఉంది. మూడోది సేవ. వ్యాపారవేత్తలను నేను దేశ నిర్మాతలుగా చూస్తాను. వారికి సేవ చేయడం నా బాధ్యత. ఈ మూడు 'స'ల వల్లే దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25% ఏపీకే వస్తున్నాయి" అని లోకేశ్ అన్నారు. ఢిల్లీలో మీకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందా, అమరావతికి కేంద్రం నుంచే నిధులు వస్తున్నాయా అన్న ప్రశ్నకు లోకేశ్ స్పందిస్తూ, "ఎక్కువ ఎంపీలు ఉండటం వల్ల మా గొంతు గట్టిగా వినిపించడానికి అవకాశం దొరికింది. కానీ, రాష్ట్రాల మధ్య పోటీతత్వం ఉంటేనే దేశం గెలుస్తుంది.

## మెట్రోపై సానుకూలం

(మొదటి పేజీ తరువాయి)



ఆర్ఆర్‌టీఎస్ ఫార్ములాకు రాష్ట్ర ప్రభుత్వం జరుఒప్పుకోలేదనే విషయాన్ని కిషన్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలిసింది. మెట్రో రెండో దశకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన విషయాన్ని అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం సంయుక్త కమిటీ ఏర్పాటు చేస్తే, తద్వారా సమన్వయ ప్రక్రియ ఆలస్యం లేకుండా మెట్రో విస్తరణ వేగవంతమవుతుందనే విషయాన్ని ఇద్దరు కేంద్ర మంత్రులూ రేవంత్‌రెడ్డితో అన్నట్లు తెలిసింది.

**మెట్రో ఫేజ్--2 50:50 నిష్పత్తిలో..**

హైదరాబాద్ మెట్రో ఫేజ్--1లో ఈక్విటీ షేర్ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15వేల కోట్ల లావాదేవీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ మేరకు ఐఆర్ఎఫ్‌సీ రుణం మంజూరు చేయడానికి ఒప్పందం కుదిరింది. అయితే, జూన్ 15న మొదటి విడత రుణం విడుదల కాలేదని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అశ్వినీ వైష్ణవ్‌కు చెప్పారు. ఆ రుణం విడుదల చేయడంతోపాటు మెట్రో ఫేజ్--2ను 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా చేపట్టేలా ఆమోదించాలని కోరారు. భేటీ అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చర్చలు సానుకూలంగా సాగినట్లు చెప్పారు. మంగళవారం కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన తర్వాత, మెట్రో ప్రాజెక్టు సమస్యలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఖట్టర్, రేవంత్ భేటీలో కిషన్‌రెడ్డి కూడా పాల్గొననున్నారు.


**పరస్పర సవాళ్ల మధ్య భేటీ**

హైదరాబాద్ మెట్రో రైలు వ్యవహారం ముందుకెళ్లకుండా మోకాలడ్డుతున్నారంటూ కిషన్‌రెడ్డిపై కొన్నిరోజులుగా రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి కిషన్‌రెడ్డి స్పందిస్తూ ఎన్నికల హామీల అమలులో తమ వైఫల్యంపై ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులివ్వొద్దని తాను ఏ మంత్రికి చెప్పానో నిరూపించగలరా? అని సవాలు కూడా విసిరారు. అయితే తాను రెండ్రోజుల ఢిల్లీ పర్యటనకు వస్తున్నానని, అప్పుడు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని రేవంత్ బహిరంగ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో రైల్వే మంత్రితో రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి సమావేశమవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి... జాగ్రత్తగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఌప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై



ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు. ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్టార్మర్ రాజీనామా

లండన్: దశాబ్దకాలంగా తరచూ ప్రధానమంత్రి పదవి నుంచి అగ్రనేతలు వైదొలగుతున్న దృశ్యం మరోసారి బ్రిటన్‌లో కన్పించింది. సమర్థవంతమైన పరిపాలన అందించట్లేదంటూ సొంత లేబర్ పార్టీ ఎంపీల నుంచే తీవ్రస్థాయిలో ఒత్తిడి నేపథ్యంలో బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామాచేశారు. లేబర్ పార్టీ నేత హోదా నుంచీ తప్పుకుంటున్నట్లు సోమవారం ప్రకటించారు. సెప్టెంబర్‌లో తదుపరి ప్రధాన మంత్రిని ఎన్నుకునేదాకా తాత్కాలిక ప్రధానిగా కొనసాగుతానని 63 ఏళ్ల స్టార్మర్ వెల్లడించారు. త్వరలో కొలువుతీరే ప్రభుత్వానికి తన పూర్తి మద్దతు, సంపూర్ణ సహకారం కొనసాగుతుందని ఆయన స్పష్టంచేశారు. గత వారం బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ(హౌస్ ఆఫ్ కామన్స్) నియోజకవర్గం మేకర్‌ఫీల్డ్ ఉపఎన్నికల్లో గెలిచిన సొంత పార్టీ ముఖ్యనేత ఆండీ బర్న్‌హామ్ ఇప్పుడు ప్రధానమంత్రి రేసులో ముందంజలో ఉన్నట్లు యూకే మీడియాలో కథనాలు వెలువడ్డాయి. "తదుపరి ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తా"అని బర్న్‌హామ్ చేసిన ప్రకటన ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తోంది. రాజీనామాకు ముందే స్టార్మర్ సోమవారం ఉదయం బ్రిటన్ రాజు చార్లెస్--3తో భేటీ అయి తన రాజీనామా అంశాన్ని వెల్లడించారు. రాజీనామా చేశాక లండన్‌లోని ప్రధానమంత్రి కార్యాలయం 10, డౌనింగ్ స్ట్రీట్ భవనం నుంచి స్టార్మర్ బయటికొచ్చి మీడియాతో భావోద్వేగంతో మాట్లాడారు.





# రెండుగా చీలుతున్న చౌటుప్పల్..!

- మట్టికట్ట నిర్మాణంతో ఉత్తర, దక్షిణ భాగాలుగా విడిపోతున్న పట్టణం
- పిల్లర్ల ఫ్లైఓవర్ హామీ ఏమైంది? ప్రజల్లో తీవ్ర అయోమయం
- అండర్ పాస్‌ల కొరత.. 100 పడకల ఆసుపత్రికి వెళ్లేందుకు తిప్పలు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) విస్తరణలో భాగంగా చేపట్టిన నూతన ఫ్లైఓవర్ నిర్మాణం ఇప్పుడు స్థానిక ప్రజలకు, వ్యాపారులకు పెద్ద శాపంగా మారబోతోందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణ డిజైన్‌లో జరిగిన లోపాల వల్ల చౌటుప్పల్ పట్టణం భౌగోళికంగా 'ఉత్తర చౌటుప్పల్', 'దక్షిణ చౌటుప్పల్' గా రెండు ముక్కలుగా విడిపోతుండటంతో అటు పట్టణ ప్రజలతో పాటు ఇటు మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

**అప్పట్లో పిల్లర్ల ఫ్లైఓవర్ అని చెప్పి.. ఇప్పుడు మట్టికట్టతో బలి!**

గతంలో (12-07-2024 రోజున) అప్పటి మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ ఫ్లైఓవర్ వివరాలను ఆర్భాటంగా వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో రూ. 114 కోట్ల వ్యయంతో 2.45 కిలోమీటర్ల పొడవున ఈ ఫ్లైఓవర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయం దారి నుంచి రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ ఆర్ ఆర్) జంక్షన్ వరకు ఈ ఫ్లైఓవర్ వస్తుందని, ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు 200 మీటర్లు పిల్లర్లతో కూడిన ఎలివేటెడ్ కారిడార్ ఉంటుందని, మిగతా భాగం మట్టికట్టతో నిర్మిస్తారని నాడు ప్రకటించారు. వలిగొండ అడ్డరోడ్డు వద్ద 30 మీటర్ల అండర్ పాస్, భాస్కర్ టాకీస్ వద్ద 3.5 మీటర్ల మరో చిన్న అండర్ పాస్ వస్తుందని, దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని నాడు భరోసా ఇచ్చారు. కానీ, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే కథ అడ్డం తిరిగింది. పిల్లర్ల నిర్మాణం చాలా తక్కువ భాగంలో ఉండి, పట్టణం మధ్యలో కిలోమీటర్ల పొడవునా భారీ మట్టికట్ట (వాల్) నిర్మిస్తుండటంతో పట్టణం నిలువునా చీలిపోతోంది. రహదారికి ఇరువైపులా ఉన్న ప్రజలు, వ్యాపారులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకోలేని విధంగా ఈ కట్ట ఒక పెద్ద అడ్డుగోడలా మారుతోంది.

**ఆసుపత్రికి వెళ్లాలన్నా.. నరకయాతనే!**

పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లే రోగుల పరిస్థితి ఈ ఫ్లైఓవర్ నిర్మాణంతో అగమ్యగోచరంగా మారింది. అత్యవసర సమయంలో (ఎమర్జెన్సీ) మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే అంబులెన్స్‌లు గానీ, రోగుల వాహనాలు గానీ ఆసుపత్రికి నేరుగా వెళ్లేందుకు ఈ మట్టికట్ట వల్ల సరైన రోడ్డు మార్గం లేకుండా పోయింది. సరైన జంక్షన్లు, అండర్ పాస్‌లు లేకపోవడంతో కిలోమీటర్ల దూరం చుట్టుకుని వెళ్లాల్సి వస్తోందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ ఆలస్యం శాపంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**లక్ష్యాలు మారాయా? దర్గా తొలగించకుండానే పనులు!**

హైవే విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా స్థానిక దర్గా తొలగింపునకు అప్పట్లో కాంపోజిషన్ కింద అధికారులు కోటి రూపాయల నిధులు మంజూరు చేయడమే కాకుండా, లక్కారం మోడల్ స్కూల్ సమీపంలో ప్రత్యామ్నాయ భూమిని కూడా కేటాయించారు. అయితే, ఆ నిధులు, భూమి కేటాయింపులు కాగితాలకే పరిమితమయ్యాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సదరు దర్గాను తొలగించకుండానే, ఆ స్థలాన్ని అలాగే వదిలేసి హైవే పనులను ప్రభుత్వం పూర్తి చేస్తుండటం గమనార్హం.

**ఆందోళనలో వ్యాపారులు, పాదచారులు:**

మరోవైపు ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో వాహనాల రాకపోకల కోసం సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు నాడు ప్రకటించినా, ప్రస్తుతం అరకొర రహదారులతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. చిన్నకొండూరు, తంగడపల్లి చౌరస్తాల పరిధిలో పాదచారులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవే పక్కన ఉన్న వందలాది వ్యాపార సముదాయాలు ఈ మట్టికట్టల వెనుక దాగిపోయి వ్యాపారాలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, మట్టికట్టల శాతాన్ని తగ్గించి, పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్‌ను పొడిగించాలని, ఆసుపత్రికి వెళ్లేందుకు స్పష్టమైన రోడ్డు మార్గాన్ని డిజైన్ చేయాలని చౌటుప్పల్ పట్టణ, మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపైనే ధ్యాస.. నియోజకవర్గంపై లేదు: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస మునుగోడు నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధిపై లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన 'తొలివెలుగు' ప్రతినిధితో మాట్లాడారు. చౌటుప్పల్ పట్టణంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులపై స్థానిక ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేదని మండిపడ్డారు. గతంలో మంజూరైన పిల్లర్ల ఫ్లైఓవర్ ప్రస్తుతం మట్టికట్టగా ఎలా మారిందో సమాధానం చెప్పాలన్నారు. తాను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సంప్రదించగా.. 15 నెలల క్రితం పనులు ప్రారంభమైన సమయంలో ఎవరూ అభ్యంతరం చెప్పనందునే మట్టికట్టతో నిర్మిస్తున్నామని, ఎల్బీనగర్ తరహాలో అప్పట్లోనే అభ్యంతరం తెలిపి ఉంటే పిల్లర్ల బ్రిడ్జి వచ్చేదని అధికారులు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో బస్టాప్ వద్ద బస్సులు వెళ్లేందుకు కనీసం అండర్ పాస్ అయినా ఏర్పాటు చేయాలని కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారని వివరించారు. దర్గా తొలగింపునకు కోటి రూపాయల నిధులు, భూమి కేటాయించినా ఎందుకు తొలగించకుండా పనులు చేస్తున్నారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. అలాగే వలిగొండ రోడ్డు విస్తరణలో మొండికుంట కాలువ వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం, అక్రమ ఆక్రమణలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ పనులను నిలిపివేసి, పిల్లర్ల బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వంపై, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిలపై ఒత్తిడి తెస్తామని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే పిల్లర్ల బ్రిడ్జి రద్దు.. కేంద్రం వద్ద నిధుల కొరత లేదు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి




చౌటుప్పల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ డిజైన్ మార్పు వెనుక స్థానిక నేతల ఓటు బ్యాంకు రాజకీయాలు, నిర్లక్ష్యం దాగి ఉన్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన 'తొలివెలుగు' ప్రతినిధితో మాట్లాడారు. తొలుత చౌటుప్పల్ బస్టాండ్ నుండి తంగడపల్లి రోడ్డు వరకు ఫ్లైఓవర్‌ను పూర్తిగా పిల్లర్ల పైనే నిర్మించాలని ప్రతిపాదించారని, అయితే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి ఖర్చు తగ్గించే నెపంతో అండర్‌పాస్ నిర్మాణానికి మొగ్గు చూపారని విమర్శించారు. పట్టణంలోని ఒక దర్గాను తొలగించడం ఇష్టం లేక, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మైనారిటీ ఓట్ల కోసం డిజైన్‌ను మార్పించాయని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అక్కడి ముస్లిం, మైనారిటీ నాయకులతో కూర్చొని మాట్లాడుంటే ఈ సమస్య వచ్చేది కాదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 100 నుండి రూ. 200 కోట్ల అదనపు నిధులు తెచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నా, స్థానిక ప్రజాప్రతినిధులకు నియోజకవర్గ ప్రగతిపై కనీస అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. మట్టికట్టతో నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలపై మనోహర్ రెడ్డి స్పందిస్తూ.. ఈ పనులు కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో జరుగుతున్నాయని, ఒకవేళ నిర్మాణంలో ఏదైనా లోపం ఉంటే 10 నుంచి 15 ఏళ్ల వరకు కాంట్రాక్టరే దానికి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే వలిగొండ రోడ్డులోని మొండికుంట కాల్వ వెడల్పును అడ్డగోలుగా తగ్గించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని అంశమని, కాల్వ వెడల్పును తిరిగి పెంచేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## రాజాపేట గడికోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ నాయకుల వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని చారిత్రక రాజపేట సంస్థానం కోట (గడికోట)ను పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరుతూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆలేరు నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన మంత్రిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి ఇక్కడి చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. ఎంతో చరిత్ర కలిగిన రాజాపేట గడికోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి జూపల్లి సానుకూలంగా స్పందించినట్లు, కోట అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన

- జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన సదస్సు
- ఎస్ఐ లక్ష్మీనారాయణ విజ్ఞప్తి

**తొలివెలుగు,ఆత్మకూరు (ఎం):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) లక్ష్మీనారాయణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత, విద్యార్థి లోకం మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. వివిధ రకాల డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలను శాస్త్రీయంగా వివరించారు. క్షణికానందం కోసం అలవాటు చేసుకునే వ్యసనాలు జీవితాలను రోడ్డున పడేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## గురుకులంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

- 'ఈగల్ ఫోర్స్' ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థుల ప్రతిజ్ఞ



**తొలివెలుగు, రాజాపేట:** య ం ం వ త న ం మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఈగల్ ఫోర్స్' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజాపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) లింగారెడ్డి, ఏఎస్సై ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల మహమ్మారికి దూరంగా ఉండి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేణికుంట యువకుడి అదృశ్యం

- కేసు నమోదు చేసిన రాజాపేట పోలీసులు
- సమాచారం ఉంటే తెలపాలని ఎస్ఐ విజ్ఞప్తి



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రేణికుంట గ్రామానికి చెందిన బుడిగే ప్రవీణ్ (26) అనే యువకుడు అదృశ్యమైనట్లు రాజాపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) లింగారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ ఈ నెల 20వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద ఎంత వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన యువకుడి తల్లి బుడిగే మంజుల సోమవారం రాజాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన యువకుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా 8712662807 ఫోన్ నంబరు ద్వారా గానీ సమాచారం అందించాలని ఎస్ఐ లింగారెడ్డి కోరారు.

# బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురికి సన్మానం

- రెండోసారి ఎంపిక కావడంపై హర్షం
- రాజాపేట మండల బీజేపీ నాయకుల అభినందనలు



**తొలివెలుగు, రాజాపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన కస్తూరి మాధురి చంద్ర రెండోసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు రాజాపేట మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హర్షం వ్యక్తం చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా మాధురి చంద్ర నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఆమె నేతృత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మదర్ డైరీకి పూర్వవైభవం తెస్తాం

- చల్లూరు పాల సంఘం ఛైర్మన్‌గా 27వ సారి గాల్ రెడ్డి ఏకగ్రీవం
- రైతులకు సబ్సిడీలు, బోనస్ సౌకర్యం: మాజీ డైరెక్టర్ వెల్లడి



**తొలివెలుగు, రాజాపేట:** అందరి సహకారంతో మదర్ డైరీకి పూర్వవైభవం తీసుకురానున్నట్లు మదర్ డైరీ మాజీ డైరెక్టర్ ఆర్కాల గాల్ రెడ్డి తెలిపారు. రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు ఆదివారం ఎన్నికల అధికారి బాలమల్లయ్య సమక్షంలో చల్లూరు అన్నదాత పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాల సంఘం ఛైర్మన్‌గా ఆర్కాల గాల్ రెడ్డి వరుసగా 27వ సారి ఏకగ్రీవంగా ఎన్నికై రికార్డు సృష్టించారు. అలాగే డైరెక్టర్లుగా పల్లెపాటి కిష్టయ్య, బోల్లెంపల్లి తిరుపతిరెడ్డి, రేణికుంట నరసయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని రైతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఛైర్మన్ గాల్ రెడ్డి మాట్లాడుతూ.. మదర్ డైరీ ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సంస్థను ఎన్‌డీడీబీలో విలీనం చేయడంతో పాటు అప్పులను తొలగించామన్నారు. ఇకపై రైతులకు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లుల మొత్తం నేరుగా ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ ప్రక్రియకు సహకరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డైరీ ఛైర్మన్ గుడిపాడి మధుసూదన్ రెడ్డి, విజయ డైరీ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మదర్ డైరీలో పాలు పోసే రైతులకు లీటరుకు రూపాయి అదనపు ధరతో పాటు దాణా, మందులపై 50 శాతం సబ్సిడీ, వార్షిక బోనస్ కల్పిస్తున్నట్లు వివరించారు. రైతులంతా మదర్ డైరీకే పాలు పోసి సంస్థ బలోపేతానికి సహకరించాలని కోరారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

- ఆరోగ్య లక్ష్మి కమిటీ ఎన్నిక
- పలకలు పంపిణీ చేసిన సర్పంచ్ బొడ్డు భాస్కర్



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని కుర్రారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బొడ్డు భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నూతన 'ఆరోగ్య లక్ష్మి' కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారులకు సర్పంచ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించి, వారికి పాఠశాల పలకలను బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చిన్నారి పిల్లల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని, తల్లులందరూ తమ పిల్లలను కేంద్రాలకు పంపించి పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు మేడి స్వరూప, రాపాక మానస, పాఠశాల ఉపాధ్యాయుడు నరసింహులు, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, సంఘ బంధం అధ్యక్షురాలు రాధ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# మళ్లీ మోగిన బడి గంట!





- తిమ్మాపురంలో రెండేళ్ల తర్వాత ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం
- విద్యార్థులతో జాతీయ గీతాలాపన చేయించిన సర్పంచ్ లక్ష్మి
- ఎంఈఓ మహదేవరెడ్డి, సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో వేడుకగా ప్రారంభం

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గత రెండేళ్లుగా మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమవారం పునఃప్రారంభమైంది. మండల విద్యాధికారి (ఎంఈఓ) కె.మహదేవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (హెచ్‌ఎం) సంతోష ల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ కొసన లక్ష్మి కిష్టయ్య యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులతో జాతీయ గీతాలాపన చేయించి పాఠశాలను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, బూట్లు, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే ప్రాధాన్యత కల్పించేలా గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి వినతిపత్రం అందజేస్తామన్నారు. పాఠశాల పునఃప్రారంభానికి సహకరించిన అధికారులకు, గ్రామ యువతకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


# బాధిత కుటుంబానికి 'క్రాంతి యూత్' ఆర్థిక సాయం

- రూ.25 వేల నగదు అందజేత



**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన గుర్రాల ఎల్లయ్య (అనారోగ్యంతో మృతి) కుటుంబానికి గ్రామంలోని క్రాంతి యువజన సంఘం ప్రతినిధులు అండగా నిలిచారు. సోమవారం ఎల్లయ్య భౌతికకాయానికి క్రాంతి యూత్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం తరపున రూ.25,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బండ కృష్ణ గౌడ్, క్రాంతి యూత్ అధ్యక్షుడు మాకోలు రాజశేఖర్, ఉపాధ్యాయుడు/ఉపాధ్యక్షుడు బండి బుచ్చిబాబు, గౌరవ సభ్యులు బండి రవి, ఎర్ర లక్ష్మణ్, ఉడతల వాసుదేవ్, యద్దనోజు జయప్రకాష్, నీరుడు నాగభూషణం, చెక్క ప్రభాకర్, బండి ఆనంద్, ఉడతల సాయి, ఉడతల శివ, గడ్డం పవన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# పాల మల్లయ్య సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే కుంభం అనిల్



- దంతూరులో మల్లయ్య దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే
- యాదవ మహాసభ నాయకుల పరామర్శ

**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని దంతూరు గ్రామానికి చెందిన జిల్లా యాదవ మహాసభ ఉపాధ్యక్షుడు మాకోలు శ్రీనివాస్ తండ్రి మాకోలు మల్లయ్య (పాల మల్లయ్య) దశదినకర్మ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్లయ్య గత 40 ఏళ్లుగా పాల వ్యాపార రంగంలో ఉంటూ మండల, పట్టణ వినియోగదారులకు నమ్మకమైన సేవలు అందించారని కొనియాడారు. తన నిరుపమాన సేవలతో అందరి అభిమానాన్ని చూరగొన్న వ్యక్తి పాల మల్లయ్య అని ప్రశంసించారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, సర్పంచ్‌లు గోరుగంటి సువర్ణ రవీందర్, చుక్క శోభశంకర్, మచ్చ శ్రీనివాస్, మండల నాయకులు మన్నె వెంకట్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బోదాస్ చిన్న ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.




# అక్రమ ఇసుక రవాణాపై నిఘా: రెండు ట్రాక్టర్ల సీజ్

- తుర్కపల్లి నుంచి తరలిస్తుండగా పట్టుకున్న రాజాపేట పోలీసులు
- నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపిన ఎస్ఐ లింగారెడ్డి

**తొలివెలుగు, రాజాపేట:** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు రాజాపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) లింగారెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం గందమళ్ళ గ్రామం నుండి రాజాపేటకు అక్రమంగా ఇసుక తరలుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఇసుకతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను అడ్డుకుని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. సదరు వాహనాలను టీజీ 30జి 3827, టీజీ 05 టీఆర్ 4261 నంబర్లు గల ట్రాక్టర్లుగా గుర్తించారు. ఇవి తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన గజం వంశీ కుమార్, బట్ట దయానంద్ లవని తేలడంతో వాహనాలను సీజ్ చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

# ఆర్థిక సహాయం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, సోమవారం ఆమె కుటుంబాన్ని 'జెల్ల పరమేష్ యువసేన' ప్రతినిధులు పరామర్శించారు. యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, సామాజిక వేత్త జెల్ల పరమేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. బుచ్చమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు, విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారికి యువసేన తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు జెల్ల కర్ణాకర్, నమిలే నవీన్, ప్యాట నరేష్, కొత్తపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా స్థాయి చెస్ పోటీల్లో వలిగొండ క్రీడాకారిణి ప్రతిభ

- అండర్-17 విభాగంలో బి. టీనాకు ద్వితీయ బహుమతి
- ఎస్పీ శరత్ చంద్ర పవార్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం

**తొలివెలుగు, వలిగొండ:** నల్గొండలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి చెస్ పోటీల్లో వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన క్రీడాకారిణి బి. టీనా ద్వితీయ బహుమతి సాధించి ప్రతిభ చాటింది. మేకల అభినవ్ జయంతిని పురస్కరించుకుని నల్గొండ జిల్లా చెస్ అసోసియేషన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంయుక్త ఆధ్వర్యంలో నల్గొండ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించారు. అండర్-17 విభాగంలో పాల్గొన్న టీనా ఐదు రౌండ్ల పాటు సాగిన పోటీల్లో వరుస విజయాలు సాధించి ఫైనల్‌కు చేరింది. తుది పోరులో రన్నరప్‌గా నిలిచి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా పోలీస్ అధికారి (ఎస్పీ) శరత్ చంద్ర పవార్, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా టీనా మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారిణిని వలిగొండ పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు అభినందించారు.

# మొండికుంట కాలువ కబ్జా.. పట్టణానికి ముంపు ముప్పు!

- కల్వర్టు పొడవు తగ్గించి అక్రమ నిర్మాణాలు
- రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, అక్రమ నిర్మాణాలను కూల్చేయాలి
- జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించిన చౌటుప్పల్ బీజేపీ నేతలు



**తొలివెలుగు, చౌటుప్పల్/యాదాద్రిభువనగిరి:** చౌటుప్పల్ పట్టణ పరిధిలోని వలిగొండ ప్రధాన రహదారిలో గల మొండికుంట కాలువ స్థలం తీవ్ర ఆక్రమణలకు గురవుతోందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావును చౌటుప్పల్ మున్సిపాలిటీ బీజేపీ కౌన్సిలర్ బుడ్డ సురేష్, పార్టీ జిల్లా కార్యదర్శి ఆలే చిరంజీవి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు వంగాల రమాకాంత్ గౌడ్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చౌటుప్పల్ - వలిగొండ రోడ్డులోని సర్వే నెంబర్ 175, 176 పరిధిలో గల మొండికుంట కాలువను కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. గత 2020లో ఫిర్యాదు చేయగా అప్పటి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, 100 మీటర్ల పొడవుతో కల్వర్టు, 100 ఫీట్ల వెడల్పుతో కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా కల్వర్టు పొడవును 20 మీటర్లలోపే కుదిస్తూ పునర్నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన 80 శాతం మురుగునీరు ఈ కాలువ ద్వారానే ప్రవహిస్తుందని, కాలువ పరిమాణం తగ్గిస్తే భవిష్యత్తులో చౌటుప్పల్ పట్టణానికి ముంపు ముప్పు పొంచి ఉందన్నారు. వెంటనే సర్వే నిర్వహించి అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరారు.

# సైబర్ బాధితులకు నగదు రీఫండ్‌కు ఆదేశాలు

సైబర్ నేరాల బాధితులకు సత్వర న్యాయం అందించడంలో సైబరాబాద్ పోలీసులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ నెల 20న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన 2,232 సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితులకు అనుకూలంగా కోర్టుల నుంచి రీఫం డ్ ఆదేశాలు పొందడంలో విజయాన్ని సాధించారు. ఈ ఆదేశాల ద్వారా మొత్తం రూ.21.90 కోట్ల నగదు బాధితులకు తిరిగి అందేలా మార్గం సుగమమైంది. వివరాల్లోకి వెళితే... సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 24 పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టి బాధితుల తరఫున రీఫండ్ పిటిషన్లు దాఖలు చేయగా, న్యాయస్థానాలు సానుకూలంగా స్పందించాయి.

# యోగాతో మానసిక ప్రశాంతత!

- చౌటుప్పల్ విశాల భారతి స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సూర్య నమస్కారాలు, ఆసనాలు






**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణంలోని విశాల భారతి హైస్కూల్‌లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిక్షణలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుత వరమన్నారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ అలవడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని సూచించారు. కార్యక్రమానికి విచ్చేసిన యోగ గురువు ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ.. మహర్షి పతంజలి అందించిన అష్టాంగ యోగ నియమాలు కేవలం వ్యాయామాలు మాత్రమే కావని, అవి మనిషిని ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేర్చే సంపూర్ణ జీవన విధానమని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, మానసిక స్థైర్యాన్ని పెంచడానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ ఝాన్సీ, ఆచార్య బాలకృష్ణల పర్యవేక్షణలో విద్యార్థులు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్, బి.ఎడ్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



- జిల్లా ఉన్నతాధికారికి ఎస్ఎఫ్ఐ వినతిపత్రం
- బడుల్లోనే పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు.. వేలల్లో ఫీజుల భారం
- విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ యాజమాన్యాలు
- చౌటుప్పల్‌లో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్/యాదాద్రిభువనగిరి:** చౌటుప్పల్ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ విద్యాసంస్థలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఉన్నతాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులను బలవంతంగా పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయించే విధానం కొనసాగుతుండటంతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ వసతి గృహం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చౌటుప్పల్‌లో వెంటనే బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, జిల్లా కార్యదర్శి లాడియా రాజు, జిల్లా కమిటీ సభ్యుడు అరవింద్, మండల ఉపాధ్యక్షుడు వరుణ్ తేజ్, సతీష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంట్లో నాలుగు మృతదేహాలు

- అనుమానాస్పద స్థితిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- మృతిపై పలు అనుమానాలు, వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ, ఏఎస్పీ
- ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు



నీలగిరి, జూన్ 22: నల్లగొండ పట్టణ శివారులోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో కలకలం రేగింది. కుటుంబ సభ్యులంతా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో పాటు రక్తపు మరకలు ఉండటం, గేటుకు బయటి నుంచే తాళం వేసి ఉండటంతో వారి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కాలనీ వాసులు, స్థానిక కార్పొరేటర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. మృత దేహాలు నాలుగూ కుళ్లిపోయి ఉండటాన్ని గుర్తించారు. వివరాల్లోకి వెళితే నల్లగొండ ప్రకాశం బజార్‌లోని ఓ ప్రైవేట్ దుకాణంలో పనిచేస్తున్న మహ్మద్ సుల్తాన్ (45) భార్య గతంలో చనిపోయింది. ఆయనకు ఇద్దరు పిల్లలు. కుమారుడు ముజామ్మిల్ (20), కూతురు అప్సర్(14) ఉన్నా రు. సుల్తాన్ మొదటి భార్య చనిపోవడంతో విడాకులు తీసుకొని ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న హసీనాను (41) రెండో వివాహం చేసుకున్నాడు. కాగా వీరు మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇది హత్యా..? ఆత్మహత్యా..? అన్న కోణంలో వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు ముందు ఇంట్లో ఘర్షణ జరిగినట్లు స్థానికుల చెబుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు యంత్రాంగం, క్లూస్ టీమ్, ఆధారాల సేకరించి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా విషయం తెలియడంతో ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఏఎస్పీ రమేష్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితమే వీరు మరణించడంతో శవాలు గుర్తించలేని స్థితిలో ఉన్నాయని, దర్యాప్తు వేగవంతం చేశామని, త్వరలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.

### పోలీసుల అదుపులో ఇద్దరు..

ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆ నలుగురి మృతికి కారణాలు తెలియకపోవడంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఏసీ మెకానిక్‌గా పనిచేసే ముజమ్మిల్ ఎప్పుడూ కుటుంబ గొడవలు ఉన్నాయని, వాటితో సతమతమవుతున్నానం టూ స్నేహితులతో అనేవాడని తెలిసింది. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటం, దొంగతనం చేసినట్లుగా వస్తువులు కింద పడేసి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..







# విద్యార్థుల భవిష్యత్తుకు చక్రాలపై భరోసా

- రవాణా సౌకర్యంతో విద్యార్థుల డ్రాపౌట్‌కు నివారణ
- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్
- గట్టుప్పల్ పీఎం శ్రీ పాఠశాల, నారాయణపురం మోడల్ స్కూల్‌కు రూ.70 లక్షల విలువైన బస్సుల బహుకరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాజకీయాలకు అతీతంగా సహకారం







**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా చదువును మధ్యలో మానేసే పరిస్థితులను గణనీయంగా తగ్గించవచ్చని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలకు, గట్టుప్పల్ మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ఫౌండేషన్ తరఫున రూ.70 లక్షల విలువైన రెండు స్కూల్ బస్సులను సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాళ్లతో కలిసి ఆయన బస్సులను ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో భాస్కర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని చెప్పారు. మోడల్ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆంగ్ల ప్రసంగం అమెరికన్ యాసను తలపించేలా ఉందని ప్రశంసిస్తూ, ప్రభుత్వ పాఠశాలల నుంచి మరిన్ని ప్రతిభావంతులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. గట్టుప్పల్ పాఠశాల పరిధిలోని ఐదు గ్రామాల విద్యార్థులకు ఈ బస్సు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాలకు అందించిన బస్సుకు మొదటి సంవత్సరం డ్రైవర్ జీతాన్ని కూడా తమ ఫౌండేషన్ భరిస్తుందని ప్రకటించారు. భవిష్యత్తులో పీఎం శ్రీ పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు విస్తరించేందుకు అవసరమైన అనుమతులు తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. అవసరమైతే మరిన్ని బస్సులు, ఇతర మౌలిక సదుపాయాలు కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాజకీయాలకు అతీతంగా సహకరిస్తానని, విద్యార్థుల భవిష్యత్తు కోసం తన ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భాస్కర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఇఎల్‌వి ఫౌండేషన్ డైరెక్టర్ ఇఎల్‌వి అశోక్, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# లింగోజిగూడెంలో వైభవంగా బొడ్రాయి మహోత్సవం

- వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్
- గ్రామదేవతల ఆశీస్సులతోనే సుఖసంతోషాలు: మొగుదాల పావని
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన భక్తజనం, ప్రజాప్రతినిధులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో సోమవారం బొడ్రాయి పండుగ వేడుకలను గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఊరంతా పండుగ వాతావరణం సంతరించుకోగా, ఉదయం నుంచే వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు, జలాధివాసం, ధాన్యాధివాస కార్యక్రమాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ సరిహద్దుకు విచ్చేసిన ఆమెకు మహిళలు మంగళహారతులతో, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్య సమర్పణ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బొడ్రాయి అనేది కేవలం ఒక శిల కాదని, గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి, కంటికి కనబడని క్రిమికీటకాల నుంచి, ప్రకృతి ప్రకోపాల నుంచి రక్షించే సర్వదేవతల స్వరూపమని ఆమె కొనియాడారు. ఇటువంటి సాంప్రదాయ ఉత్సవాల ద్వారా గ్రామంలో ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. లోకకల్యాణార్థం గ్రామస్థులంతా కలిసికట్టుగా ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బి.యన్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మూడో వార్డు అధ్యక్షుడు శివారెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప రాజు, చింతల సాయిలు, తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, లింగస్వామి, వెంకటేష్‌లతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఇసుక దందాకు నిండు ప్రాణం బలి

భద్రాద్రి కొత్తగూడెం/మణుగూరు రూరల్: ఇసుక లారీల వల్ల ఏర్పడిన ట్రాఫిక్ జామ్ లో అంబులెన్స్ చిక్కుకోగా... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తరలించలేని పరిస్థితి ఎదురైంది. ఇసుక లారీల వల్ల 20 కి.మీ దూరం ప్ర యాణానికి రెండు గంటలకుపైగా పట్టడంతో నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ ఘటన సోమవా రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో చోటుచేసుకుంది. పినపాక మండలం గడ్డిగూడెం గ్రామానికి చెందిన కొమురం వంశీ (32) బీటీపీఎస్ ప్లాంట్‌లోని బూడిద చెరువు వద్ద డెయిలీ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మార్గమధ్యలో వ్యక్తిగత కార ణాలతో గడ్డి మందు తాగగా, మణుగూరు మండలంలోని దమ్మక్కపేట లో మామ వరుసయ్యే మడి శంకర్ ఇంటికి వెళ్లి విషయాన్ని చెప్పాడు. దీంతో శంకర్ 108 కు ఫోన్ చేశారు. ఆపై అంబులెన్స్ వచ్చే వరకు ఆలస్యమవుతుందని బైక్‌పై మణుగూరు-- ఏటూరునాగారం ప్రధాన రహ దారి వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి ఆటోలో మణుగూరు వంద పడకల ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. సాంబాయిగూడెం దగ్గరికి ఆటో చేరుకోగానే రామానుజ వరం--1 ఇసుక రీచ్‌కు వచ్చి వెళ్లే లారీలతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రెండు వైపులా కిలోమీటర్ మేర భారీ లారీ లు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వంశీ అపస్మారక స్థితికి చేరుకుంటుండటంతో ఆటోకు దారి వదలా లని కోరినా డ్రైవర్లు లారీలను రో డ్డు దించేందుకు ససేమిరా అన్నా రు. దీంతో 9--50 గంటల సమయా న వంశీని చేతులపై ఎత్తుకున్న బంధువులు మణుగూరు వైపు నడక సా గించారు. అంతలోనే మణుగూరు నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న ఓ అంబులెన్స్ ఎదురుకావ డంతో అందులోకి ఎక్కించినా ప్రధా న రహదారిపై ముందుకు, వెనక్కి వెళ్లే వీలులేక సాంబాయిగూడెం--పగిడేరు మీదుగా డొంక దారిలో గంటకుపైగా ప్రయాణించి ఉదయం 11--10 గంటలకు వంశీని మణుగూరు ఆస్పత్రికి చేర్చారు. అయితే, ఆయన అప్పటికే మృతి చెందారు. గంట ముందు తెచ్చి ఉంటే బతికించే అవకాశం ఉండేదని చెప్పడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.



# వాహనాలు తనిఖీ చేస్తుండగా...

**17 రోజుల క్రితమే బదిలీపై భూపాలపల్లికి రాక**

**రోడ్డు ప్రమాదమా? లేక కుట్రకోణమా?**

**ఆ కోణంలోనూ విచారణ... నివేదిక త్వరగా ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం**

వరంగల్: వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో బొగ్గులారీ ఢీకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రవాణాశాఖాధికారి (డీటీఓ) దుర్మరణం చెందాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. డీటీఓ మద్దోజు వెంకన్న(45) సోమవారం ఉదయం గణపురం మండలంలోని మోరంచపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ట్యాక్స్ చెల్లించని ఒక హార్వెస్టర్‌ను పట్టుకొని చెల్పూరు సమీపంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి తరలించారు. తాను సైతం కారులో కార్యాలయం వద్దకు చేరుకుని రహదారిపై నిలబడి మళ్లీ వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాను పట్టుకున్న హార్వెస్టర్ డివైడర్ వైపు నుంచి కార్యాలయం లోపలికి వెళ్తుండగా భూపాలపల్లి నుంచి ఉప్పల్ వెళ్తున్న బొగ్గు లారీ హార్వెస్టర్ ముందు భాగాన్ని ఢీకొట్టి ఎడమవైపున ఉన్న డీటీఓ వెంకన్నపైకి దూసుకెళ్లింది. దీంతో అతను లారీ టైర్ల కింద పడి నడుము భాగం నుజ్జునుజ్జయింది. రవాణాశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని డీటీఓ వెంకన్నను ఆస్పత్రికి తీసుకెళ్ళేందుకు ప్రయత్?నంచినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆయన మృతిచెందాడు. కాగా, వెంకన్న ఈ నెల 5వ తేదీనే భూపాలపల్లికి బదిలీపై వచ్చారు. సరిగ్గా 17 రోజులకే ఈ సంఘటన జరగడంతో జిల్లా రవాణాశాఖలో విషాదం అలుముకుంది. లారీడ్రైవర్ మహ్మద్ తస్లీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గణపురం ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. వెంకన్న స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా మరిపెడ గ్రామం. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడున్నారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపిస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వరంగల్‌లో స్పష్టం చేశారు. కాగా, ఆయన పారి?థవదేహాన్ని హనుమకొండలో ఆశోక కాలనీలోని నివాసానికి తీసుకువచ్చారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ గౌడ్, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, సత్యశారదలు వెంకన్న పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.




**విచారణకు ఆదేశించిన ప్రభుత్వం**

వెంకన్న మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ప్రమాదం యాదృచి?ఛకంగా జరిగిన రోడ్డు ప్రమాదమా? లేక కుట్రకోణం దాగి ఉందా? అన్నది విచారణలో తేలనుంది. రవాణాశాఖ కేంద్ర కార్యాలయంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.చంద్రశేఖర్ గౌడ్‌ను విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తేల్చటంతోపాటు, సాధారణ ప్రమాదమే అయి ఉంటే, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అంశాలపై సిఫారసులు కూడా ఆయన ఇవ్వనున్నారు. వీలైనంత త్వరలో నివేదిక అందించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది.

**ఆ కుటుంబాన్ని ఆదుకుంటాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

భూపాలపల్లి డీటీఓ వెంకన్న వాహనాల తనిఖీలు చేస్తుండగా బొగ్గు లారీ ఢీకొని చనిపోవటం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆయన అధికారులను ఆదేశించారు. కాగా డీటీఓ వెంకన్న మృతిపై రవాణాశాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ విచారం వ్యక్తం చేసింది. విధుల్లో ఉన్న సమయంలో లారీ ఢీకొని మృతి చెందాల్సిన పరిస్థితి రావటం దారుణమని, ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి సురేశ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబానికి అసోసియేషన్ అండగా నిలుస్తుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమని ప్రకటించారు.